మినీకథ



# ఊహించని ఉత్తరం

అరుంధతి

ఉదయం పది గంటల సమయం. రోజూ లాగే ఆ రోజూ అన్ని వీధుల్లోనూ డ్యూటీ ముగించుకొని శ్రీనివాసనగర్ కాలనీ లోకి ప్రవేశించాడు గోపి. అతనా వీధి పోస్ట్‌మన్. ఇంటర్ డిస్టింక్షన్‌లో పాస య్యాడు. బియస్సీ చదివాడు. డిగ్రీ హోల్డరయి పోస్ట్‌మన్‌గా రావడం బాధవిప్పించినా, ఇంటి ఆర్థిక పరిస్థితి చూసి యీ ఉద్యోగంలో చేరాడు. ఎంతైనా "సంథింగ్ యీజ్ బెటర్ దేన్ నథింగ్" అని మనసును సమాధానపరుచుకున్నాడు.

వరుసగా ప్రతి ఇంటిముందూ సైకిలాపి లెటర్స్ ఇస్తూ వస్తున్నాడు. ఆరవ నెంబర్ ఇల్లది. సుమారు పద్దెనిమిదేళ్ళ అమ్మాయి గేట్లో నించుని వుంది. ఆకుపచ్చని పావడా. నారింజరంగు వోణీ. పచ్చని రవిక వేసుకొని వుంది. ఆ కళ్ళలో ఏదో ఆకర్షణ. పలుచని చెంపలు. గులాబిరంగు పెదవులు. ఓహ్..ఏదో అపురూపసౌందర్యం మిళితమైవుంది ఆమెలో. గోపీ కనపడగానే ఆ కళ్ళల్లో వింత ఆనందం చిందులేసింది. ఆత్రత కన్పించింది. ఆ ఆత్రం చూసి నవ్వుకున్నాడు గోపి. వారి అడ్రసుకి ఏమైనా వున్నాయా అంటూ వెదికాడు. ఊహూ.... ఏవీ లేవు. ఏమీ చెప్పకుండానే ముందుకెళ్ళి పోయాడు సైకిల్ నడిపించుకుంటూ.

అతను డ్యూటీలో యీ వీధికి మారిన నెల నుంచి రోజూ ఇంచుమించు ఇలాగే జరుగుతోంది. అతి ఆంక్జయిటీతో ప్రతి ఒక్కరూ ఎదురుచూసే విషయం ఇదొక్కటే నన్పిస్తుంది గోపీకి. కాని అందరికీ తెలుసు, రోజూ క్రమం తప్పకుండా తమ పేర ఉత్తరాలు రావని. కాని ఆ ఎదురు చూడడం మాత్రం మానరు.

ఉదయం పది గంటలు కావడం. వీధిలో సైకిల్ బెల్ విన్పించడమూ రెండూ అందరి కళ్ళనీ, ధ్యానాన్ని వీధి వాకిలివైపు మరలుస్తాయి. మరికొందరు ఆత్రం. ఉత్సాహం పట్టలేక గేట్లోనే నిలబడతారు. ఉత్తరం పోస్ట్‌మన్ ఇచ్చేదాకా ఆగలేక ఇంచుమించు లాక్కుంటున్నట్లు తీసుకుంటారు. మరికొందరు గేట్లోకి ఇంట్లోకి పచార్లు చేస్తూంటారు. ఈ విధంగా తల్లిదండ్రుల్ని కొడుకులతో కూతుర్లతోనూ స్నేహితుల్ని, భార్యాభర్తల్ని కలిపే యీ వుద్యోగం పట్ల గౌరవభావం కలిగేది గోపీకి. తన రాకకు వారంతా ఎదురు చూస్తూంటే ఎంతో గర్వంగా ఫీలయ్యేవాడు.

కాని ఆ ఆనంద కలర్ మేడ దగ్గరికి రాగానే అందులోని పోర్షన్లలో 6వ నెంబర్ ఇంటి దగ్గరికి రాగానే ప్రాణం ఉసూరుమంటుంది. కారణం ఆ అమ్మాయి రోజూ అలా ఎదురు చూస్తూనే వుంటుంది తను వచ్చే సమయానికి. అయినా ఏ రోజూ ఉత్తరం వారికి రాదు. కనీసం ఆమె పేరున. మరి ఆమె సహనాన్ని ఎవరు పరీక్షిస్తున్నారో? తల్లిదండ్రులో. అన్నదమ్ములో. స్నేహితురాలో. వదినలో లేక-లేక-ఉత్తరం వ్రాస్తాను....వ్రాస్తానని ఊరించే బాయ్ ఫ్రెండో ఆమెకే తెలియాలి. లేక ఎవరూ వ్రాయరని తెలిసీ ఉబుసుపోకకి నిలబడి వుంటుందా. ఏమో! ఏదో చిలిపి ఊహ వచ్చిందతనిలో'....అవునా....తనని చూడటానికి తను వచ్చే సమయానికి అలా నిలబడివుంటుందా....యువకుడు.... కాస్త ఎర్రగా, సన్నగా ఉన్నాననా. నో.... నో.. వీల్లేదు. తన కోసమే అయితే తను కాలనీ దాటేదాకా అక్కడే వుండాలిగా. అలా వుండదు. తను వారిల్లు దాటగానే లోపలికి వెళ్ళిపోతుంది. అదీ నిరాశగా నిరుత్సాహంగా!'

ఆ రోజూ అంతే. ప్రక్కింటి వారికిచ్చి వెళ్ళిపోతున్న గోపిని చూసింది. ఆ కళ్ళలో ఆశ. ఆత్రం. అతను ఓరగా ఓ క్షణం చూసి. ఉత్తరాల్ని గబగబా వెదికాడు. అతను వెదికినంతసేపూ ప్రాణం ఉగ్గబట్టుకొని వేచి చూసింది. ఉంటే పైకి తీసిచ్చేవాడు. లేవు. రాలేదు. తనకు వ్రాసేవాళ్ళెవరూ లేరు. అయినా యీ ఎదురు చూపులు మాత్రం మానుకోలేదు, ఎవరైనా వ్రాస్తారనే ఆశతో. కాని ప్రతిరోజూ నిరాశే. అతను లేవనడానికి తలెత్తి చూసేసరికి ఆ అమ్మాయి లేదు. ఎప్పుడు లోపలికెళ్ళిపోయిందో.

ఆ రోజు సోమవారం. వర్క్ చాలా వుంది. అతను నెమ్మదిగా డెలివరీ చేస్తున్నాడు. పదకొండు గంటలయింది. వచ్చే మేడ. ఆరవ నెంబర్ ఇల్లు గేట్లో ఆ అమ్మాయి. షరా మామూలే. ఆ రోజు ఆ కాంపౌండ్‌లో ఎవరికీ ఉత్తరాలు రాకపోవడంతో సైకిలు ఆపవలసిన అవసరమే లేకపోయింది. వెనక్కి తిరిగి ఆ అమ్మాయిని చూడాలన్పించింది. కాని సభ్యత వెన్నుతట్టి ఆ ప్రయత్నం విరమించుకున్నాడు.

గోపి మరీ మరీ ఆలోచించాడు. ఈ రోజుతో యీ కాలనీ డ్యూటీ అయి

పోతుంది. మళ్ళీ ఎప్పుడొస్తాడో అందుకే దృఢ నిశ్చయానికొచ్చాడు.

* * * *


ఆ అమ్మాయి ఆ రోజు తలంటిపోసుకుంది. వదులుగా రెండు జడలు. కళ్ళనిండా కాటుక. చిన్న బొట్టు. నీలి రంగు బట్టల్లో చాలా అందంగా వుంది. గోపి తమ గేటు వద్ద సైకిల్ దిగగానే వరండా నుంచి రెండంగల్లో గేట్లోకి వచ్చింది. కాని అంతలోనే నిరాశ. 'తనకెవరు వ్రాస్తారు. రోజూ ఉన్న అనుభవమే కదా!' అనుకొని వెను దిరగబోయింది.

'పోస్ట్' వినరావడంతో వెనక్కి తిరిగింది. తనకేనా అన్న ప్రశ్న ఆ కళ్ళలో. అదేమీ గమనించకుండా అతను కవర్ అందించాడు. తీసుకొని ఉత్తరంపై అడ్రస్ చూసింది. ఆశ్చర్యంతో ఆమె కళ్ళు పెద్దవయ్యాయి. ఆప్యాయంగా కవర్‌పై తన అడ్రస్‌ని తడిమింది. పరవళ్ళు త్రొక్కే సంతోషం ఆపుకోవటానికి ఆమెకి సాధ్యం కాలేదు. 'ఎన్నాళ్ళకి తనకి ఉత్తరం? అబ్బ ఏమిటీవింత...' ఉత్తరం ఇచ్చాక ఆ కళ్ళలో వెలుగు చూడాలన్నట్లు ఉత్తరాలకట్టలో ఏదో వెదుకుతున్నట్లు నటిస్తూ అరక్షణం పరిశీలించాడు. కోటికాంతుల ఆనందం. హుషారు. ఇన్నాళ్ళకు తన పేర ఉత్తరం వచ్చినందుకు కృతజ్ఞతతోనూ సంతోషంగాను చూసింది. అప్పుడే తలెత్తినట్లు చూసి చిన్నగా నవ్వీ నవ్వకుండా చిరునవ్వు నవ్వి వెళ్ళిపోయాడు గోపి.

లోపలికి పరుగున వెళ్ళిపోయింది. మంచంపై వాలి కవరు విప్పింది.

ఉమగారూ!

నమస్తే. ఎవర్దీ అపరిచిత దస్తూరీ. సంతకం అనుకుంటున్నారా. నేను మీకు బాగా తెలుసు. అఫ్‌కోర్స్ గుర్తించి వుండరు. మీరు మాత్రం నాకు సుపరిచితులే. ఆ పరిచయం పురస్కరించుకునే ఈ ఉత్తరం వ్రాస్తున్నా. లోకంలో కొందరికి ఏదైనా పని చేస్తూంటే దాని రిజల్ట్ తెలుస్తూనే వుంటుంది. అయినా ఆ పని చేయడం మానరు. ఫరెగ్జాంపుల్ మీకు ఉత్తరం వ్రాసేవారున్నారో లేరో, ఉన్నా తాత్సారం చేస్తున్నారో తెలియదు. ఏ రోజూ ఉత్తరం రాకున్నా. మీరు మీ వీధి పోస్ట్‌మన్ వచ్చే సరికి రోజూ ఎదురు చూస్తుంటారు. ఆ సమయాన మీ కళ్ళలో ఆశ. ఆత్రుత. అది గమనించగల అవకాశం నా ఒక్కడికే ఉంది. ఎలాగంటారా? మీ పోస్ట్‌మన్‌ని




నేనే కనుక. ఆశ్చర్యపోతున్నారా! అవును నేనే. గోపాల్‌ని. నా మూలంగా ఏ ఒక్కరూ బాధపడ్డం నేను చూడలేను. పరోక్షంగా మిమ్మల్ని నిరుత్సాహపరుస్తున్నాననిపించింది. నే డ్యూటీలో చేరాక నా చేతిమీదుగా ఏ రోజూ మీకు ఉత్తరం రాలేదు. ఇదివరకున్న పోస్ట్‌మన్ ద్వారా మీ వాళ్ళ ఉత్తరాలు అందేవేమో! క్రొత్త పోస్ట్‌మన్‌ని తిట్టుకుంటూండేవారేమో! అందువల్ల ఇది వ్రాస్తున్నా. సాహసం చేశాననుకుంటే క్షమించండి.

నేను బి.ఎస్‌సి. పాసయ్యాను. ఏ ఉద్యోగం లేక తిరిగే నాకు డిగ్రీ తిండి పెట్టకపోయినా డిస్టింక్షన్ ఇంటర్ యీ ఉద్యోగం ప్రసాదించింది. ముందు ముందు ప్రాస్పెక్ట్స్ వుంటాయని చేరిపోయాను. మొదట్లో కాస్త నిరుత్సాహపడ్డా. మీ పేరెలా తెల్సిందనుకుంటున్నారా. మొన్న గేట్లో మీరు నిలబడివుంటే మీ అమ్మగారనుకుంటా మిమ్మల్ని పేరుపెట్టి పిల్చారు. విన్నాను. యీ సాహసం చేశాను. అన్నట్లు నాకు మరో ఉద్యోగం వచ్చింది. ఇంతకన్నా మంచిది. ఇక వెళ్ళిపోతున్నా. రోజూ మీ నిరాశ. నిస్పృహ గమనించాను. మీకు ఉత్తరాలు తరచు అందుకోవాలని ఆశ వుంటే ఓ పని చెయ్యండి. నాకు కలం స్నేహం అంటే చాల ఇష్టం. లెటజ్ కంటిన్యూ దిస్ లెటర్స్ బిజినెస్. ఓన్లీ ఇఫ్ యు ఆర్ ఇంట్రెస్టెడ్. మీ కభ్యంతరం లేకపోతేనే.

నా అడ్రస్ క్రిందనే వుంది. ధైర్యం చేశాననుకుంటే 'సారీ' మరోసారి. ఆలోచించుకుని సమాధానం వ్రాయండి. ఉండనా.... ఇక.

మిత్రుడు

—గోపి

—అరుంధతి

అనుభవం, జీవితం, మృత్యువు, ఏకాంతం, ప్రేమ, శీలం, దేవుడు.... భయం.... వీటి గురించి పాఠకుల్ని కదిపి కుదిపి ఊపివేసే తాత్విక నవలిక "గతి"

"జ్ఞానపూరితమైన ప్రశాంత జీవితంలో అనుభవాలు మాత్రమే వున్నయ్. వాటి తాలూకు స్పృహ లేదు, జ్ఞాపకాలు లేవు, చరిత్ర లేదు."

"ఈ అవగాహనే నిజమైన స్వేచ్ఛ. ఇదే ప్రశాంతి. మోక్షం. నిర్వాణం. దైవత్వసిద్ధి!"

డాక్టర్ జి. ఆర్. కృష్ణ

ఈ అపూర్వ సత్యాన్ని తెలుగులో నవలారూపంలో ఆవిష్కరింపజేయడానికి చేసిన తొలి ప్రయత్నం ఈ "గతి"

వచ్చే వారం నుంచి ప్రారంభం

"గతి" చదవడం ఒక తాత్వికానుభవం!